క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని అడ్వాలపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి లక్ష్మణ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్జరీ ఖర్చుల కోసం పెద్దపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధును కుటుంబ సభ్యులు సంప్రదించగా సీఎం సహాయనిధి ద్వారా రూ.75వేలు మంజూరు చేయించాడు. ఈ మేరకు మధు తనయుడు పుట్ట శ్రీహర్ష గురువారం ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి అందజేశారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన చిట్యాల సమ్మయ్య అనారోగ్యంతో బాధపడుతు చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిల దృష్టికి పలుగుల బీఆర్‌ఎస్‌పార్టీ నాయకుడు బర్ల కుమార్ తీసుకువెళ్లాడు. వారి ఆదేశాలతో రూ.లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం యువనాయకుడు పుట్ట శ్రీహర్ష బాధిత కుటుంబానికి నిమ్స్ ఆస్పత్రిలో అందజేశారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



టేకుమట్ల: మండల అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామక్రిష్టాపూర్ (టి) గ్రామంలోని విద్యావనరుల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. కంటి వెలుగు విజయవంతానికి కృషి చేసిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశాజ్యోతి, వైద్య సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి



పలిమెల: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామాల్లో గుర్తించిన పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షాకాలం రాక ముందే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంకుడు గుంతలకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్‌సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు మండలంలోని యామన్‌పల్లి, కొర్లకుంట గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం

● ఎమ్మెల్యే సీతక్క

వెంకటాపురం(ఎం): రైతులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క రైస్ మిల్లర్లపై ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని కేశవపూర్ గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవాటానికి తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల చేతిలో అన్నదాతలు దోపిడీకి గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో, తరుగు పేరుతో క్వింటాలుకు 10 కేజీల నుంచి 12 కేజీల వరకు కోతలు విధిస్తూ అన్నదాతలను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ఒకవైపు వడగండ్ల వానలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోగా, మరో వైపు పంటలను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ ఇప్పటికైనా చొరవ తీసుకొని మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలులో తరుగు లేకుండా కొనుగోలు చేసేలా చూడాలని లేనిపక్షంలో రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని కేశవపూర్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన కోడారి పర్వతాలు, దేవనందుల లక్ష్మి కుటుంబాలను ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఎండీ ఖబీర్, రాంబాబు, భద్రయ్య, ప్రభాకర్ రెడ్డి, గండ్ర బాబురావు, భిక్షపతి, ఏళ్లస్వామి, సంతోష్ పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సీతక్క అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు దాటిన తర్వాతనే ఆడపిల్లలకు వివాహాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రజిత, జెడ్పీటీసీ గై రుద్రమదేవి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొరిక గోవింద్ నాయక్, స్థానిక ఎంపీటీసీ జంగిలి శ్రీలత పాల్గొన్నారు.

మంచానికే పరిమితం..

● కేన్సర్‌తో క్షీణించిపోతున్న నంద బాబు ఆరోగ్యం

దీన గాథ

వెంకటాపురం(ఎం): మాతా పితా వెల్ఫేర్ సొసైటీ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తి.. తన కలం ద్వారా 'చెమట నది' 'ఇకనైనా మారు' 'ఒకటైన ఆచరించు' అనే పుస్తకాలు రాసి వితంతు మహిళల కోసమే కాకుండా ప్రజలను చైతన్యపరిచే కవిత్వాలు రాశాడు. అనాథ పిల్లలను సైతం చదివిస్తు అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ఎంతోమంది ప్రేమాభిమానాలు సంపాదించుకున్న నంద బాబు నేడు కేన్సర్‌తో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన నంద బాబు 15 సంవత్సరాలుగా పత్రికా రంగంలో పనిచేస్తూ, తన కలం ద్వారా వార్తలనే ఆయుధాలుగా మలుచుకుని ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేశాడు. ఒంటరి మహిళల, వితంతు, దివ్యాంగుల కోసం మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలంగా పలువురు మంత్రులకు, అధికారులకు వినతి పత్రాలు ఇస్తూ పోరాటం చేశాడు. జిల్లాలో గుడుంబా, బెల్టు షాపులు, గుట్కాల వ్యాపారాన్ని నియంత్రణకు పోరాటం చేశాడు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే నంద బాబు గత పదేళ్ల క్రితం కేన్సర్ బారినపడ్డాడు. అయినా చికిత్స తీసుకుంటూనే సామాజిక రుగ్మతలపై పోరాటం చేశాడు. నిస్వార్థంగా సేవ చేస్తూ తనదైన శైలిలో చెరగని ముద్ర వేసుకుని, తన కవిత్వాల ద్వారా ప్రముఖులతో రాష్ట్ర, జాతీయ ప్రశంస పత్రాలు సైతం అందుకున్నాడు. కవిగా, రచయితగా జర్నలిస్టుగా ఎంతో మందిని జ్ఞానవంతులుగా చేసిన నంద బాబు కేన్సర్ తీవ్రత పెరగడంతో మంచంపై జీవచ్ఛవంలా పడిఉన్నాడు. వ్యాధి నయం కాకపోవడంతో పాటు రోజురోజుకు ఆరోగ్యం క్షీణించిపోతుంది. కాగా, బాబు ఆరోగ్యంపై బెంగపెట్టుకున్న అతడి తల్లి సత్తెమ్మ గుండెపోటుతో పది రోజుల క్రితం మృతి చెందింది. వ్యాధి తీవ్రత ఎక్కువ కావడంతో ఆహారం కూడా నోట్లోకి వెళ్లడం లేదు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వ్యాధి తీవ్రత పెరగకుండా నంద బాబును ఏదైనా ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



కేన్సర్‌తో బాధపడుతున్న నంద బాబు

రాజ్యాంగ గ్రంథం ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాజేడు: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతీ ఒక్కరికి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ సయ్యద్ సర్వర్‌కు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగాన్ని పౌరులకు ఇస్తే అందులోని అంశాలు అందరికి తెలుస్తాయని తెలిపారు. సామాన్య ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని సూచించారు. చెన్నంరాజు, ఇల్లెందుల రాజు, పవన్, విజయ్, సందీప్ ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): కొత్తగూడెంలో జూన్ 4న నిర్వహించనున్న సీపీఐ ప్రజా గర్జనను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ప్రజా గర్జన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు ప్రజలు, మేధావులు, యువకులు, కార్మికులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డం రామకృష్ణ, నాసర్, రాజు, సారయ్య తదితరులు ఉన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి కట్టుబడి ఉండాలి

వెంకటాపురం(కె): ఆస్పత్రి అభివృద్ధికి కమిటీ కట్టుబడి ఉండాలని అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చెరుకూరి సతీశ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(పీహెచ్‌సీ)లో గురువారం అభివృద్ధి కమిటీ సమావేశంలో సతీశ్ మాట్లాడారు. వైద్యం కోసం వచ్చి వారికి అవసరమైన పరికరాలు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. విద్యుత్ మరమ్మతు పనులు, ప్లంబింగ్ పనులు చేసేలా తీర్మానం చేశారు. ఏ సమయంలోనైనా రోగులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, వైద్యాధికారి భవ్యశ్రీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెరుకూరి సతీశ్‌కుమార్

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న పంట

టేకుమట్ల(రేగొండ): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన రేగొండ మండలంలోని రేపాకలో గురువారం చోటుచేసుకుంది. రైతు బోయిని రాజయ్య కథనం ప్రకారం .. తనకున్న 5 ఎకరాల వ్యవసాయ భూమిలో ఇటీవల ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తూ అంతర్ పంటగా మొక్కజొన్న వేసినట్లు తెలిపారు. పంటను కోతకోసిన అనంతరం ఇంటికి తరలించే తరుణంలో 11 కేవీ విద్యుత్ వైరు తెగి పడటంతో మంటలు చెలరేగి మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైందన్నారు. అలాగే ఐదు ఎకరాల్లోని ఆయిల్ పామ్ పంట సైతం పూర్తిగా అగ్నికి ఆహుతైందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే అన్ని విధాల ఆదుకొని పరిహారం అందించాలని కోరారు.

పరామర్శ

చిట్యాల: మండలంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన శనిగరపు రాజీరమ్మతో పాటు గిద్దెముత్తారం, అందుకుతండా, బావుసింగ్‌పల్లి గ్రామల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం శాంతినగర్‌లో వారం రోజుల క్రితం అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన దానవేన తిరుపతి, చింతకింది దశరథం కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కాత్రేవుల సాయిలు, జడల్‌పేట, అందుకుతండా గ్రామాల సర్పంచ్‌లు రత్నాకర్ రెడ్డి, సిద్ధంకి భాస్కర్, నాయకులు చింతల రమేష్, జెన్నె యుగందర్, పువ్వాటి హరికృష్ణ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మంగపేట: నగదును అందజేస్తున్న రమేష్



ములుగు రూరల్: కాశిందేవిపేటలో..

మంగపేట: మండలంలోని రమణక్కపేట పంచాయతీ పరిధిలోని పాత సినిమాహాల్ ప్రాంతానికి చెందిన శ్రీరాం కాంతారావు గత మూడు నెలల క్రితం ఫెరాల్సిస్ రావడంతో మంచానికి పరిమితం అయ్యాడు. దీంతో బాధిత కుటుంబాన్ని రామకృష్ణ సేవా ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ గురువారం పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఆర్థిక స్తోమత లేక దయనీయ పరిస్థితిలో ఉండటంతో వైద్య ఖర్చులకు గాను రూ.5,000 నగదును బాధితుడికి అందజేశారు. అదే విధంగా మల్లూరు బీసీ కాలనీలోని నిరుపేద కుటుంబానికి చెందిన నరెడ్ల నాగలక్ష్మి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.3000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ బాడిష నవీన్, ఆదినారాయణ, ఇందారపు రమేష్, మహేష్, చౌళం వేణు, వంశీకిరణ్, ప్రవీణ్, సోయం ఈశ్వర్, అలీంపాషా గ్రామస్తులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: మండలంలోని కాశిందేవిపేట గ్రామానికి చెందిన జరీనా బేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సర్పంచ్ అహ్మద్‌పాషా గురువారం పరామర్శించి 50 కేజీల బియ్యం, రూ.2500 ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఇనుముల సుధాకర్, మద్దెల సంపత్, గుండాల రఘు, శివాజీ, ఎండీ చాంద్‌పాషా, అక్రమ్, రవి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని తిమ్మంపేట బోరునర్సాపురం గ్రామాల మధ్య గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అబ్బాయిగూడెం గ్రామానికి చెందిన అన్నారపు సతీష్ అనే యువకుడు ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన మాటూరి లక్ష్మయ్య అనే వ్యక్తితో కలిసి తన ద్విచక్ర వాహనంపై మంగపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మణుగూరు వైపు నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ద్విచక్ర వాహనం నడుతున్న సతీష్ కింద పడి స్పృహ కోల్పోగా వెనుకాల కుర్చున్న లక్ష్మయ్యకు గాయాలయ్యాయి. వెంటనే వారిని మంగపేట పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యాధికారి సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సతీష్‌ను 108లో వరంగల్‌కు తరలించారు.



సతీష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

ఆధార్ సెంటర్ ప్రారంభం

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ భూక్య విజయ్ కోరారు. గురువారం కారల్‌మార్క్స్‌కాలనీలోని పోస్టాఫీసులో ఆధార్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు, నవీకరణ కోసం ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌పోస్ట్ మాస్టర్ ఖలీల్ పాషా, సిబ్బంది మన్మోహన్ శర్మ, ఆధార్ యూజర్ నాగరాజు పాల్గొన్నారు.



ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

ఓడబలిజల సంక్షేమానికి కృషి చేయాలి

ఏటూరునాగారం: ఓడబలిజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి గార పోశాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓడవాడలో ఓడబలిజ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను పోశాలు ఆవిష్కరించి మాట్లాడారు. మత్స్య వృత్తి చేసుకునే వారికి పక్కా భవనాలు, వాహనాలు, పడవలు ఇవ్వాలన్నారు. హెల్త్ కార్డులు అందజేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్ల అరుణ, బోట తిరుపతమ్మ, అంగల వీరన్న, సుగందపు నర్సింహులు, పానెం సాంబశివరావు, రాందాస్ సత్యనారాయణ, బోట రమణయ్య, ఎర్రల్ల రమేష్, గార ఆంజనేయులు, డర్ర హరికృష్ణ, పానెం నాగేశ్వర్‌రావు, రాందాస్, ముత్తేష్, గార మహేష్, సత్యం, సంతోష్, చందు, వెంకటేష్, రాములు, రాందాస్, పోతురాజు, రాందాస్, వెంకటేష్, నర్సమ్మ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా ఓడబలిజ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని శివాలయం సెంటర్‌లో, వీఆర్‌కేపురం గ్రామంలో గురువారం నిర్వహించారు. సంఘం జెండాను రాష్ట్ర నాయకుడు డర్రా దామోధర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఓడబలిజల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్, కన్నయ్య, సమ్మయ్య, శ్రీకాంత్, రమేష్, శివరాణి, నర్సింహారావు, రాంబాబు, వెంకటేశ్వర్లు, రవి ఉన్నారు.

వాజేడు: ఓడబలిజ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో నిర్వహించారు. ఓడ బలిజ సేవా సంఘం నాయకులు జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, నాయకులు పాల్గొన్నారు.



ఏటూరునాగారం: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న గార పోశాలు, నాయకులు



వెంకటాపురం(కె)లో..



వాజేడులో..

రైతును రాజు చేయడమే లక్ష్యం

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: రైతును రాజు చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి మండలం కొంపల్లి, గూడాడ్‌పల్లి, గొర్లవీడు నేరేడుపల్లి, వజినపల్లి గ్రామాల్లో కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న పంటల రైతులకు నష్టపరిహారం చెక్కులతోపాటు పలువురి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం గూడాడ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రాంభించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కల్లెపు శోభ రఘుపతి రావు, ఎంపీపీ మండల లావణ్య సాగర్ రెడ్డి, డీఎస్పీ రాములు, సీఐ రాంనర్సింహారెడ్డి, వ్యవసాయ శాఖ, ఉద్యవన శాఖ అధికారులు విజయ్ భాస్కర్, సంజీవరావు, సునీల్, మండల పార్టీ అధ్యక్షుడు పిసిరెడ్డి రాజిరెడ్డి పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: పంట పరిహారం చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

చిట్యాల: ప్రతి పేదవారికి వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చల్లగరిగ గ్రామంలో రూ.20లక్షల నిధులతో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెల్త్ సబ్ సెంటర్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో నూతన వైద్య కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా 23 మంది సూపర్ స్పెషాలిటి డాక్టర్లు నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, ఒడితల పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు రాజేందర్ గౌడ్, మేరుగు సంపత్ ఉన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో గల తాటి వనంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై ఎండీ. షాఖాన్ గురువారం తెలిపారు. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కంచు తిరుపతి, గోపగాని కుమారస్వామి, కంచర్ల నాగరాజు, కంచర్ల మధు, నగరం పోచాలు, జన్నే సురేష్‌లను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, 5 సేల్ ఫోన్లు, 3 ద్విచక్రవాహనాలు, రూ.24వేల రూపాయాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది సురేందర్, సిద్దార్థ, అస్లాం జానీ, తదితరులు ఉన్నారు.



అరెస్టు చూపుతున్న ఎస్సై షాఖాన్